పోల్చుకుంటే, బ్రతుకుబాటలోని

# వ్యత్యాసాలు

అవసరాల రామకృష్ణారావు

ఇద్దరూ యిద్దరు పరాక్రమవంతుల తమ్ముళ్ళే. ఎవరూ? లక్ష్మణుడూ, కుంభకర్ణుడూ. ఒకడు సర్వం త్యాగంచేసి అన్నతోపాటు అడవికొచ్చి, వచ్చిందగ్గర్నుంచీ కంటిమీద కునుకన్నది లేక కంటికి రెప్పలా అన్ననూ, వదిననూ రక్షించాడు. మరొకడు అన్నగారు శత్రువులతో సతమతమై, యిష్టజనాన్ని సైతం పోగొట్టుకుని, అల్లకల్లోల స్థితిలో అల్లల్లాడుతూంటే-కాలిమీద కాలేసుకుని హాయిగా ఆరునెలలపాటు నిశ్చింతగా నిద్రపోయాడు. ఈ పై పాత్రలు మానవసృష్టి. కాని యింతకన్న ఎక్కువ తేడాలున్న మనుష్యులు దైవసృష్టిలో ఎక్కడపడితే అక్కడే ఉన్నారు. అన్నలూ తమ్ముళ్ళే అక్కర్లేదు. ఏ బాంధవ్యమూ లేకపోయినా ఆదుకునేవారూ ఉన్నారు, ఎంత కష్టమొచ్చినా చూస్తూ ఊరుకునే వారూ ఉన్నారు. మానవ స్వభావంలో రకరకాల తేడాలు.

* * *

చిన్న కథ. ఎక్కడో చదివినట్టు జ్ఞాపకం. అతిగా నచ్చబట్టి జ్ఞాపకంవుండిపోయింది. మరేం లేదు. ఓ చిన్న ఆరేళ్ల పిల్ల తీర్థంలో తప్పిపోయింది. ఊ ఏడుస్తూంటే నాలాంటివాళ్లు నలుగురూ మూగేరు. ఆ అమ్మాయి "అమ్మ, అమ్మ"అన్న మాట తప్ప మరోమాట లేదు. పోనీ కనుక్కుందామని "మీఅమ్మ ఎలాఉంటుంది అమ్మాయీ?" అని అడుగుతే "చాలా మంచిది, చాలా బాగుంటుంది"అంది. "ఎంత బాగుంటుంది?"అని ఎవరో వెంకితనానికి అడుగుతే రెండుచేతులూ జాపి "ఇంత"అంది. ఆ చుట్టుపట్ల యీమాత్రం ఆ మాత్రం అందమైన ఆడవాళ్ళందర్నీ వెతికినా వాళ్ళమ్మ దొరకలేదు. ఇంకో అరగంటకి ఓ అతి అనాకారి "మా అమ్మే, నా తల్లే"అని కళ్లనిండా నీళ్లతో అక్కడికివచ్చి పిల్లని గుర్తించి ఎత్తుకుంది. అందరూ ఆశ్చర్యపోయారు. చిన్నపిల్ల దృష్టిలో కన్నతల్లి "అంత"అందమైనది. కన్నెపిల్లకు మొదటిరోజుల్లో మొగుడెలా ఉన్నా మన్మథుడు "మీ మనవడు బాగులేడు"అంటే ఏ అమ్మమ్మా ఒప్పుకోదు. ఇష్టాయిష్టాల్నిబట్టి మానవ ప్రవృత్తుల్లో ఇన్నిరకాల భేదాలు.

* * *

"ఇప్పుడే తెనాలినుంచి మనుషులొచ్చిమాట్లాడి వెళ్ళేరు. ఎనిమిదివేలదాకా యిస్తామన్నారు. పిల్లాడిపేర రెండెకరాల పల్లం మీ ఎదురుగుండా యిప్పటికిప్పుడు రాసిస్తామన్నారు. మాకు కుదరక పంపించేశాము"అన్నాడు తాతయ్య.

"మీరలా మాటాడుతూంటే ఇంక మేం చెప్పేదేముంది?"

"నే చెప్పవలసింది చెప్పేను. పది అంకె దాటితేగాని మాటాడవద్దు. వెధవది మొగాడు అంటేచాలు వద్దన్నా పడిపోతుంది సొమ్ము. అలాంటిది లక్షణంగా అన్ని పరీక్షలు ప్యాసై నెలకి మూడొందలు గణించి పోస్తున్నాడు. నాలుగూ అయిదూ పుచ్చుకోడానికి వాడి ఖర్మ మేం గాలింది?"

"అయితే నాకు శలవిప్పించండి" పెద్దమనిషి వెళ్ళిపోయాడు. వీధిలోకి కర్రలమోపు వచ్చింది. లోపల్నుంచి కేకవినబడింది.

"చెయ్యి తీరికలేదు. కాస్త ఓ మోపు బేరమాడి యింట్లో పడేయిద్దురూ" తాతయ్య కర్రలమోపుని పిలిచాడు. పుస్తకం చదువుతున్నా అన్నిమాటలూ నాచెవుల్లో పడుతూనే ఉన్నాయి. అరగంట బేరమాడి మూడు పావలాలు చేతిలోపెట్టి తాతయ్య లోపలికి వెళ్ళిపోయాడు. నా మనస్సెందుకో బాధ పడింది. కట్టెల మోపువాణ్ని పిలిచి వాడి సంగతి కనుక్కున్నాను.

నాలుగుమైళ్ళదూరం నడిచి వెడితే "తలుపులమ్మలోవ" అన్న చిన్నకొండ. ఆ కొండెక్కి దిగుతే చిట్టడవి. పొద్దున్నే వీళ్ళందరూ భుజాన గొడ్డళ్ళు వేసుకుని అక్కడికి వెడతారు. కొట్టిన కర్రలు ఏరడానికీ, చితుకులు పోగుచెయ్యడానికీ అందరూ - ముసిలాళ్ళూ, గర్భవతులూ, చిన్న పిల్లలూ అందరూ వెడతారు. ఇన్ని మైళ్ళూ నడిచి, ఎక్కి దిగి ఊళ్ళోకి కర్రలమోపుల బరువుతో వస్తారు. వస్తే మా తాతయ్యలాంటివాళ్లు గంటలకొద్దీ బేరమాడతారు. మరేంలేదు, అంతకుముందు జరిగిన పెళ్ళి బేరమూ, ఈ కర్రల బేరమూ నన్ను కలచివేశాయి. మొదటి ఏమిటి? మొగాడన్న ముద్రతో, చదువుకున్నాడన్న పోజుతో, స్వశక్తి లేక సొంత అభిప్రాయాన్ని గట్టిగా బయటపెట్టే చేవాలేక ఊరుకున్న భీరువుకు అన్యాయంగా అంటగట్టిన విలువ. రెండోది? రెక్కలు ముక్కలయి, మొహమంతా చెమటతో ముద్దయి, కాళ్ళూ భుజాలూ కాయలుగట్టి ఆ నాటి ముద్దకోసం నిర్భాగ్యుడు చేసుకుంటున్న న్యాయదీనాలాపన. ఇవి రెండూ బేరాలు. వీటి తేడాలు అందరికీ కనిపించవు. గమనించే అవసరం వారికిలేదు కూడాను. పోల్చుకుంటే బ్రతుకు బాటలో ఇన్నిన్ని తేడాలు.

* * *

అందరూ వచ్చారు, ఆనాటి రథయాత్రకి. ఇసుకవేస్తే రాలకుండా జనం. ఇందరు మనుషులు ఎవరే ఉద్దేశంతో వచ్చారో కనుక్కోడం కష్టమైన పని. మా చిన్న జగ్గప్పని అడుగుతే బూరాలూ, బొమ్మలకోసం అని చెప్పేడు. పాపాయి నడుగుతే జీళ్లూ మరమరాలుకోసం అంది. మాబలరాంని కదుపుతే "మరోనాడు లాటరీ వెయ్యరుగా, నాలుగురాళ్ళు గుంజుకుందామని" అన్నాడు. "నువ్వెందుకమ్మా సుబ్బమ్మా?" అంటే "ఆనాడు వచ్చినన్ని రకాల రాచ్చిప్పలు మరోనాడురావనీ" అంది. మాచెల్లాయినడుగుతే రకరకాలమనుష్యుల్ని చూద్దామనీ" అంటుంది. "కాళ్ళీడ్చుకుంటూ నువ్వెందుకురా వెంకన్నా" అంటే "ఆఖర్ని అందరికీ పులిహోర, దద్ధోజనం పంచిపెడతారు బాబూ, ఏడాదికోసారి. ఓహో ఏం రుచీ, జిహ్వ లేచిరాదూ?" అంటాడు. నాకు నవ్వొచ్చింది. దేముడిపేరుచెప్పి ఇంతమంది యిన్నిన్ని ఉద్దేశాలతో యిక్కడ పోగవుతున్నారు. ఎవరెవరకో ఎందుకు? మా హాస్టలు విద్యార్థులం-ఆ రథమైనా ఎక్కంగా ఎందుకు వెళ్ళినట్టు? ఉన్నమాట చెప్పేస్తున్నాను - ఆడపిల్లలవేటకోసం. ఒకేపేరు పెట్టుకున్నా మన దృక్పథాల్లో కావలసినన్ని తేడాలు.

* * *

ఇవన్నీ తలుచుకుని మనంచేసేదేమిటి? ఏమీ లేదు. తలుచుకోడంవరకే మనకువచ్చు. ఆరోజు పాలురావడం ఆలస్యమై, కాఫీ గొంతుకలో పడడం ఆలస్యమైతే వారంరోజులై ఆకలితో మలమల మాడుతున్నట్టేబాధ. అప్పుడు మనకి తేనాంపేట బస్సుస్టేండుపక్క నాలుగురోజులై అన్నంమెతుకంటే ఏమిటో ఎరగని ఆరుగురు పిల్లలతల్లి జ్ఞాపకంరాదు. "ఈ నాలుగు గదులూ ఏ మూలకి? ఓ సరి అయిన కిచెనా, విజిటర్సు రూమా?" అని విసుక్కుంటాం. ఆ సమయంలో హోరుమని చలిగాలీ, బారుమనిఎండా, కప్పునించి వర్షపునీళ్ళూ '- మనుషులు నివసిస్తున్న పశువులపాకలు మనకు స్ఫురించవు - ఫేషన్‌కి కట్టుకున్న సిల్కుచీరలముందు మానానికి కప్పుకున్న చింకిపాతలు కనపడవు. ఇదే లోకంలో రీతీ, నీతీ. కబుర్లకీ, కార్యాచరణకీ - రాతలకీ చేతలకీ, మధ్య ఇదుగో యివే తరతరాల అంతరాలు.

---

మానవసమాజంలో సాధారణుల గుంపువల్ల ఎప్పుడూ ఏ ఘనకార్యమూ సాధించబడలేదు. నలుగురి ఆమోదానికీ భిన్నంగా ప్రవర్తించిన కొద్దిమంది వ్యక్తుల జ్ఞానతృష్ణవల్ల, వారి ఉజ్వలమైన మేధాశక్తివల్ల, ప్రకృతి రహస్యాలు తెలుసుకోవాలనే వారి తహతహవల్ల, మహనీయులైన వారి విశాలదృక్పథం, కళాపిపాసా- వీటివల్లనే ప్రపంచంలోని అభ్యుదయం సాధించబడింది. —ఎలెక్సిస్ కారెల్